# రైతు కథ: చేను నుంచి కొనుగోలు కేంద్రం దాకా...





**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 25:** విత్తనం నుంచి పంట దాకా ఆరు నెలలు కష్టపడ్డాడు. బోరులో చుక్క నీరు లేకున్నా అప్పు చేసి ట్యాంకర్ నీళ్లు పోశాడు.యూరియా, డీఏపీ రేట్లు పెరిగినా మౌనంగా కొన్నాడు. కూలీల కొరతతో కొడుకుతో కలిసి తానే నాట్లు వేశాడు.వడగండ్ల వాన ఒకసారి, ఎండతెగులు ఒకసారి – ప్రతీసారి గుండె ఆగినంత పని. అయినా పంట చేతికొచ్చింది. ఎకరాకు 25 క్వింటాళ్లు.ఈసారి గట్టెక్కుతాం" అని కళ్లల్లో మెరుపు.కోత నుంచి కల్లం దాకా కోత మిషన్‌కు రోజుకు 3000 కట్టాడు.కూలీలకు మనిషికి 600. ట్రాక్టర్ కిరాయి 2000.చేతిలో చిల్లిగవ్వ లేదు.అయినా వడ్లు ఆరబెట్టాడు. తేమ 17% ఉండాలి,లేకపోతే కొనరు. రాత్రి పగలు కల్లంలోనే పడుకున్నాడు. ఒక్క వాన పడితే మొత్తం తడిసిపోతుంది.**కల్లం నుంచి కొనుగోలు కేంద్రం దాకా** ట్రాక్టర్ మాట్లాడితే ట్రిప్పుకు 2500 అడిగారు. చేసేది లేక ఒప్పుకున్నాడు.ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఉదయం 6 గంటలకే వెళ్లాడు.అక్కడ అప్పటికే 200 ట్రాక్టర్ల లైన్.ఎండ మండిపోతోంది.తాగడానికి నీళ్లు లేవు, నీడ లేదు. మజ్జిగ, భోజనం అంటే కల. **కాంటా దగ్గర కష్టాలు** నాలుగు రోజుల తర్వాత వంతు వచ్చింది. కాంటా దగ్గర తేమ చూశారు – 18% ఉంది, క్వింటాల్‌కు 2 కిలోల కోత అన్నారు.బతిమాలాడు. సార్, నిన్ననే ఆరబెట్టా అన్నాడు. వినలేదు. తూకం వేశారు. బస్తాకు 40 కిలోలు కాకుండా 42 కిలోలు జోకారు.తరుగు అన్నారు.ఎ గ్రేడ్ వడ్లను,బి గ్రేడ్ అని రాశారు. క్వింటాల్‌కు రూ.117 తగ్గింది.**లారీ కోసం నిరీక్షణ** తూకం అయ్యింది, కానీ లారీ లేదు. గన్ని బ్యాగులు లేవు. స్టాక్ రాలేదు అని చెప్పారు. 10 రోజులు ట్రాక్టర్ అక్కడే. రోజు కిరాయి 500.వాన పడితే తడిసిన ధాన్యాన్ని కొనమంటారు. షరతులు పెడతారు.**డబ్బు కోసం ఎదురుచూపు** చివరికి లారీ వచ్చింది, ధాన్యం వెళ్లింది. 48 గంటల్లో డబ్బులు పడతాయి అన్నారు. 20 రోజులైంది. బ్యాంక్‌కు వెళ్తే రాలేదు అంటారు. ఫెర్టిలైజర్ షాప్ యజమాని ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడు. పిల్లాడి ఫీజు కట్టలేదు. మళ్లీ రైతు పొలం గట్టు మీద కూర్చున్నాడు. చేతిలో ఖాళీ పాస్‌బుక్. కళ్లల్లో నీళ్లు. 6 నెలల కష్టం, 6 లక్షల పెట్టుబడి, 25 క్వింటాళ్ల పంట – మిగిలింది అప్పు,ఆవేదన.ఇది ఒక్క రైతు కథ కాదు.దేశంలో లక్షల మంది రైతుల వ్యథ.పండించడం వరకే రైతు చేతిలో ఉంది. అమ్మడం మాత్రం అతని చేతిలో లేదు. కాంటా దగ్గర కోత, లారీ కోసం లారీ, డబ్బుల కోసం బతిమాలు – ఇదీ నేటి రైతు బతుకు.కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, తూకంలో పారదర్శకత, లారీలు–బ్యాగుల కొరత లేకుండా చూడాలి. 48 గంటల్లో డబ్బు జమ చేయాలి. అప్పుడే రైతు బతుకుతాడు. రైతు బతికితేనే దేశం బతుకుతుంది.రైతు నేస్తం–దేశానికి వెన్నుముక ,రైతే రాజు ఆ రోజు వచ్చేనా అని కోరుకుంటున్నారు.

# కులసర్వే రిపోర్టు ఆహ్వానించదగినది

● సమాజ్వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 25:** తెలంగాణ ప్రభుత్వం ప్రచురించిన కుల సర్వే రిపోర్టును సమాజ్ వాది పార్టీ ఆహ్వానిస్తోందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్ తెలిపారు. కుల సర్వే రిపోర్టు ఒక దిక్సూచిగా తోడ్పడుతుందని అన్నారు. పలు పార్టీలు, సంస్థలు వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే రిపోర్టు ఆహ్వానించదగినదని ఆయన పేర్కొన్నారు. శనివారం బర్కత్ పుర లో పార్టీ నేతలు మహ్మద్ మజీరుల్లా బేగ్, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహ్మద్ వజీద్ సిద్దికిలతో కలిసి ఆయన మాట్లాడుతూ... కులగణన, కుల సర్వే దేశ స్థాయిలో కాకున్నా, రాష్ట్ర స్థాయిలో సాధ్యమైనందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. సరైన వాస్తవ ప్రాతిపదికపై విశ్లేషణ జరిపినప్పుడు సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడంలో ఈ కుల సర్వే రిపోర్టు తోడ్పడుతుందన్నారు. ఎన్నో కులాలలు విద్యకు, అభివృద్ధికి నేటికీ నోచుకోలేని స్థితి, కులం సామాజిక వెనుకబాటుకు గురి చేస్తున్నప్పుడు అన్ని రాజకీయ వర్గాలు మానవీయ కోణం నుండి ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. అసమానతలను తగ్గిస్తూ, అభివృద్ధి వైపు నడిపిస్తూ, సామాజిక మార్పుకు తోడ్పడడమే రాజ్యాంగ, ప్రజాస్వామిక లక్ష్యమని అన్నారు. తెలంగాణ కుల సర్వే రిపోర్టు మండల స్థాయి డేటాతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆగమైపోతుంది

**తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ ఆవేదన**

**ఖమ్మంలో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం**






**తొలి అక్షరం/ఖమ్మం, ఏప్రిల్ 25:** కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నేడు ఆగమైపోతుందని, కెసిఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ కబంధహస్తాల్లో చిక్కుకుందని అటువంటి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు.ఖమ్మం నగరంలోని మామిళ్ల గూడెంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని కపిలవాయి దిలీప్ కుమార్ శనివారం అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమాలలో ఆనాడు చురుకైన పాత్రను తను పోషించానని, కెసిఆర్ తో కలిసి చేసిన ఉద్యమాలు రాష్ట్రంలో ఉవ్వెత్తిన ఎగిసి పడిందని గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అయ్యారని, ఉద్యమ సమయంలో దళితుడే ముఖ్యమంత్రి అని ప్రకటించిన కేసీఆర్ దళితులకు ఇవ్వకుండా తానే ముఖ్యమంత్రిగా ఉండి దళితులకు ఇచ్చిన మాట తప్పి కుటుంబ పాలన కొనసాగించాడని విమర్శించారు. కెసిఆర్ పాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందకుండా ఆగమై పోయిందని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్న పాలన ప్రజాభీష్టం మేరకు కొనసాగించాలని, ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే ఏ ప్రభుత్వం అయినా ఎల్లకాలం కొనసాగలేవని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలను తమ పార్టీ నిశితంగా పరిశీలిస్తుందని, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీని ఆదరించి మరింత ముందుకు కొనసాగించేందుకు తమ సహాయ సహకారాలు అందించి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బీరప్ప, కోశాధికారి కె .గిరీష్, యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ విక్రమ్ శర్మ, సూర్యాపేట అధ్యక్షులు డాక్టర్ సోమ గాని నరేందర్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు జానీ మహమ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర చారి, స్టేట్ సెక్రెటరీ ఎన్. భాస్కరరావు, ఆర్ ఎల్ డి స్టేట్ జనరల్ సెక్రెటరీ సుధాకర్ యాదవ్, స్టేట్ జనరల్ సెక్రెటరీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో కాంగ్రెస్ సంస్థాగత బలోపేతానికి కీలక సమావేశం

● గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం నాయకుల పిలుపు

● రాబోయే ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహాలు

● జిల్లా అధ్యక్షునితో పెద్ద బోయన శ్రీనివాసరావు





**తొలి అక్షరం/కల్లూరు, ఏప్రిల్ 25:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో శనివారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైత రవీందర్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ హాజరయ్యారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై, అలాగే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులు సూచించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని అన్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ పరంపర కొనసాగించాలంటే ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణతో కలిసి కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసి డైరెక్టర్ పెద్దబోయిన శ్రీనివాసరావు పలు కీలక అంశాలపై చర్చించారు.

## ఆర్టీసీ కార్మికుల విజయోత్సవాల్లో

# కాంగ్రెస్ నేతల భాగస్వామ్యం



**చర్చలు సఫలం.. సత్తుపల్లి బస్టాండ్‌లో సంబరాలు**

**సీఎం చిత్రపటానికి పూలాభిషేకం, పాలాభిషేకం చేసిన కార్మికులు**



**తొలి అక్షరం/సత్తుపల్లి,ఏప్రిల్ 25 :** సత్తుపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో జరిపిన చర్చలు విజయవంతంగా ముగియడంతో కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రవీందర్ పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం, పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై ఎమ్మెల్యే రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, సత్తుపల్లి మరియు కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కవితను ఆశీర్వదించండి: రాకేష్ గైక్వాడ్

● హరి బోలి డివిజన్ నుండి భారీ ర్యాలీ

● తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు



**తొలి అక్షరం/హైదరాబాద్ ఏప్రిల్ 25:** హరి హోలీ డివిజన్ నుండి రాకేష్ గైక్వాడ్ ఆధ్వర్యంలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొనేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొత్తగా ఆవిర్భవించే పార్టీని ఆశీర్వదించాలని, తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించడం ఖాయమని, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడే కవితను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా అన్నారు. అద్వేయ కన్వెన్షన్ మునిరాబాద్ మేడ్చల్ జిల్లా లో జరిగిన సభ లో పాల్గొన్న నాయకులు అనిల్ కుమార్, రాజు, కుమార్, నితిన్, రవికుమార్, నవీన్, మాణిక్, దయానంద్, కృష్ణ, సాయి, షండే, అర్చన, గణేష్, దివ్య వాణి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



